# ఒకటే చీర

# 6

"నీవు తిని వచ్చిన తరువాత నేబోయి తినివత్తునుగాని, ముందు నీవేఁగి తినిరా; చీఁకటి పడినను నాకు భయములేదు" అని అత్త యనెను.

అచ్చరనయినను పిశాచముగాఁ జేసివైచు కోక కట్టుకొని కూర్చున్న కోడలొక్క నిమిష మాలోచించి—"కాదు కాదు, మీరే ముందు వెళ్ళవలయును. మీరు వచ్చిన తరువాతనే నేను" అని యనెను.

"మానమును మరియాదయు ఎక్కువ వారికిఁగాని మముబోఁటి తక్కువవారికిఁ గావమ్మా! కాఁబట్టి ఆ సంగతి వదిలిపెట్టు! నీకు మధ్యాహ్నము కూడ కూడులేదు. పైఁగా చిన్నదానవు! చీఁకటిలో ఆ గుంపులో త్రోసికొని వచ్చుటయు ప్రమాదము" అని అత్త యనెను.

"మానమును మరియాదయును గాలియు నీళ్ళవంటి వత్తా! తండ్రియును, కొడుకును తిని పదకొండు గంటలకే నాగరాజుగారి యింటికి వెళ్ళిరి గదా! మీకు మాత్రము మధ్యాహ్నము కూడేది? కాఁబట్టి ముందర మీరే వెళ్ళిరండు; తరువాతనే నేను వెళ్ళెదను. చీఁకటియనియు, గుంపనియు నాకొక దయ్యము చూపితిరి. దయ్యములు నన్నుఁ జూచి పారిపోవును" అని కోడ లనెను.

"కాదమ్మా! నీకు పచ్చపసుపు పోసినటులు, మెఱుపులు ముద్ద చేసినటు లుందువు; నీకు దృష్టి తగులునమ్మా! మఱి చెప్పను."

"మీ మాటయే నిజమగుఁగాక! మెఱుపులు ముట్టినచో దెబ్బతగులు నత్తా! దానికేమిగాని ముందు మీదే వంతు."

కోడలు మిగుల వినయ విధేయతలు కలది. అత్తమాట కెన్నఁడు నెదురాడి యెఱుఁగదు. ఆడుచో, మఱి వింధ్య పర్వతమే. ఈ సంగతి ఆ యత్తకు తెలియును. కాఁబట్టి యిఁక లాభము లేదనుకొని అత్త తన అతుకులబొంత విడిచి అటకమీఁది చీరతీసి కట్టుకొని నాగరాజుగారి సత్రమునకు వెళ్ళెను.

ఆ బస్తీలో నెటు చూచినను నాగరాజు పేరే! నాగరాజు ఆసుపత్రి! నాగరాజు అనాధ శరణాలయము! నాగరాజు దేవాలయము! నాగరాజు కాలేజి! నాగరాజు సత్రము! నాగరాజు కొళాయి! నాగరాజు వీథి!— వీథి? వీథి యేమి కర్మము? ఇఁక ఆ బస్తీ బస్తీ నాగరాజపురమై పోవచ్చును.

నాగరాజిపుడు పేదవారికి జావపోయుట కొకసత్ర మారంభించెను. ప్రతిదినము సాయంకాల మాఱు గంటలకు నాంది. పది గంటలకు భరత వాక్యము. కష్టపడి సంపాదించుకొనువారు గూడ నిటఁ దినమరఁగి సోమరు లయిపోదురను సదుద్దేశముతోడనే యిపుడతఁడు నూకలజావ పోయుట కేర్పాటొనరించెను. కష్టపడి సంపాదించుకొనఁగలవారి కీ నూకలజావ తినుట అవమానమని అతని ఉద్దేశము. సోమరితనమును అవమానమును అన్నదమ్ములని యతఁడెఱుఁగక పోవచ్చును.

రోడ్డుల కిరుప్రక్కలనున్న ముఱికి కాలువల నీరు తగులకుండ జనులు కడు జాగరూకతోఁ గూర్చుండిరి. దుమ్ములేవకుండ రోడ్లమీఁద నీరు కొట్టిరి. నాగరాజు అండ్ సన్సువారి బియ్యపు మరయందును, పిండి మరయందును, నూనె మరయందును, పంచదార మరయందును, పనిచేయు వారెందఱో వచ్చి విస్తళ్ళవేయఁ దొడిగిరి. నాగరాజును, అతని కొడుకు

గంగరాజును బంతులవెంటఁ దిరుగుచు అజమాయిషీ చేయుచుండిరి. కొందరు పచ్చడియు మఱికొందఱు ఉప్పును వేసికొనుచుఁ బోవుచుండిరి. తరువాత నూకలజావ వచ్చెను. అది పేరునకు జావ. అర్థమునకు జాఱు ముద్ద.

దరిద్ర నారాయణు లందఱును దంత యంత్రములు విప్పిరి. "ఇఁక నొక యేడాది వఱకును తిండిలేక చావ" మను ధైర్యము వారి మొగము లలోఁ గనఁబడుచుండెను. గ్రుడ్డి వారందఱును నాగరాజును చూడవలయు ననియు, కుంటివాండ్రందఱును నాగరాజు ముంగలికి పరువెత్తి జేపెట్ట వలయుననియుఁ దలచుచుండిరి. అంగవైకల్యములేని వారందఱును నాగరాజును, అతని కుమారుఁడును తమ నడుమనుండి పోవుచుండగా తలలు వంచుకొనుచుండిరి.

తన యింటిచుట్టును నలువైపులనున్న రోడ్ల నడుమ నడచుచు, ఈ దరిద్ర నారాయణులఁ జూచుచున్న నాగరాజు హృదయము బరు వెక్కెను. శిల్పసంపదతో, రసపురుషుని దెలుపు తన పాలరాతి మేడచుట్టును కూర్చున్న ఈ జీవచ్ఛవములను జూచుచున్న నాగరాజుకు సృష్టిచేయు బ్రహ్మ కీ విశ్వమునిండ శవములు కనిపించుచో నెటులుండునో యటు లుండెను. అతఁడు వడివడిగా ఆ రోడ్డుదాఁటి యెడమవైపు రోడ్డుమీఁదికిఁ దిరిగెను.

అచట బంతులన్నియు పూలమొక్కలు పాతిన చందముగా నుండెను. అతని కంటికిఁ గొంచెము శాంతి దొరకెను. నడచుచు నడచుచు నున్నవాఁడచట నాఁగి యచటఁ గూరుచున్న వారి నందఱను పరికించెను. పలువురు తన మిల్లులలో పనిబాగులవారే. "వీరుఁ గూడ నిచటికేల వచ్చిరి ?" అని యతఁడనుకొనెను. ఇఁక నిలిచినచో బాగుండదు. వారంద ఱాడువాండ్రు! అతఁడు మెలమెల్లగా పదియడుగులు నడచెను. అచట వింతతోడను వెగటు

తోడను అతఁడాగిపోయెను-మాతరమ్మ ! ప్రతిదినమును తన యింటికి పాలు తెచ్చియిచ్చును, ఓయ్యపు మరలో కూలిది !

మాతరమ్మ జావముద్ద తినుచున్నది ! అతఁడాచి చూచెను. మాతరమ్మయుఁ జూచెను. ఆమెలో నెక్కడేని యేమాత్రమేని సందియము లేదు. తన హక్కును తాను వృధాచేయకుండ వినియోగించుకొనుచున్న చందముగా తినుచు లోలోపల నాగరాజునకు మ్రొక్కుచున్నది. కొడుకును బిలిచి సరిగా వినియోగము చేయింపుమని చెప్పి నాగరాజు మేడలోనికి వెళ్ళిపోయెను.

"అప్పుడే వచ్చితి రేమి ? దరిద్ర నారాయణసేవ సమాప్తమా ?" యని యతని భార్య యోగమాయ ప్రశ్నించెను.

"ఇది సేవకాదు, పరీక్ష."

"నారాయణునికి పరీక్షయా ?"

"ఆఁ. దరిద్ర నారాయణ పరీక్ష. ఈ గుంపులో మన మిల్లుల పనివాండ్రు కూడ పలువురు దూఱిరి. వారి కేమి రోగము ? వారిలో నొకొక్కతె ఎటువంటి చీర కట్టుకొని వచ్చినదో యొకపరి చూడు ! వైస్రాయి విందుకు వచ్చినట్లు ! మాతరమ్మయు వచ్చినది ! నీవు కూడ అంత విలువ గల కోక కట్టవు. నీ వెప్పుడో అట్టి కోక కట్టినటులు గుఱుతు ?

యోగమాయ కొంచెము సిగ్గుపడి యిటులనెను – "సరిసరి. మాతరమ్మయు నామె కోడలు జయయు, ప్రతిదినమును మిల్లుకు వచ్చుచు దగ్గఱ ఉండి పాలు పిండించి మనకుఁ దెత్తురు. ఒకనాడు నేనే పాలగిన్నె తీసికొనవలసి వచ్చెను. ఆమెను చూతునుగదా గుడ్డలమ్మ ! బీరువా తీయగనే ఒక చీర కనఁబడెను. అది కట్టించి ఆమె నపుడు మిల్లుకు పంపితిని. వాండ్లు చాలా మంచి వాండ్లు !"

"మంచివాండ్లగుచో నిక్కడి కేలవత్తురు ? పేదలకు స్వతముగాని వీరికా ? వీరికి మనము జీతములిచ్చుట లేదా ?"

"ఏ మిచ్చుచున్నారు ?"

"నాకు గురుతా ? గుమాస్తా నడుగు."

"మీ రిచ్చునది తమకుఁ జాలినచో మాతరమ్మ చచ్చినను స్వతము నకు రాదు."

"ఆడువాండ్ర మీఁద నీ కభిమానము."

"ఒకవేళ నున్నచో అది మీరనుకొనినటులు తప్పుకాదుగాని, మీరిచ్చు జీతము వారి కుటుంబమునకుఁ జాలదు. అది యటులుండుగాక. నాకుఁ గూడ మీ సత్తరువున వారితోపాటు తిని రావలయునని సంకల్పము కలుగుచున్నది."

"ఏమేమి ?"

"ఇపుడొకఁ డీ దరిద్రులకు ప్రతినిధిగా మోకాలు దిగని కొల్లాయ కట్టుకొనుచుండఁగా నేనొక యేడాదిపాటు దరిద్రుల దుఃఖమెంతయో కను గొనుటకు నూకలకూడు తినజాలనా ? అదియుఁగాక కాయకష్ట మొనరించి మన సంపదలోఁ గొంతకుఁ గానున్నను గొంతకు కారణమైన మన యీ కూలివాండ్ర తరువాతనే యీ దరిద్రులు. మన గుమాస్తాల తరువాతనే యీ దరిద్రులు."

హేతుపూర్ణమైన యీ వాక్ ప్రవాహపు టురవడికి నాగరాజు మనస్సు చాల దవ్వు కొట్టుకొని పోయెను.

సరిగా ఆ సమయమునకు మాతరమ్మ వారి ముందరికి వచ్చి కొంచెము వెనుకకుఁ దగ్గి తలుపుచాటున నిలుఁవబడెను.

నాగరాజు కొంచెము బిడియపడి మేడమీదికి పోబోయి గదిలోనికి మరలెను.

"కోడలిని దీసికొని రాకుండ నీ వొక్కతెవే వచ్చితి వేమి?" అని యోగమాయ అడిగెను. "చీర్ర్...." అని ఆఁగిపోయి కొంచెము సిగ్గుపడి వేదన ననుభవించి మాతరమ్మ మరల నందుకొని—"మే మిరువురమును వచ్చుచో నింటికాపెవరు? నేను వెళ్ళుచునే పంపెదను. దానికి మధ్యాహ్నము కూడ కూడులేదమ్మా!" అని యనెను.

"సరి. నాకుఁ గనపడిపొమ్మని చెప్పు?"

"నేను చెప్పనక్కఱలేదు. దానికిఁ దెలియును" అనుచు మాతరమ్మ వడివడిగా వెళ్ళిపోయెను.

మాతరమ్మ వెళ్ళిన గంట తరువాత కోడలు జయ ఏ రోడ్డు మూలనో కూరుచుండి ఆఁకలి పోగొట్టుకొని కలకలలాడుచు యోగమాయ యెదుటికి వచ్చి దండముపెట్టి నిలువఁబడెను.

"గదిలో మీ బాబుగారున్నారు; ముందు వారికి దణ్ణము పెట్ట వలెను" అని యోగమాయ యనెను.

జయ నోరు కఱచుకొని, తెఱచిన గుమ్మము ముందు వంగి నమస్కరించుచుండగా నాగరాజు వచ్చి చూచెను. మరల నదే చీర! మాతరమ్మ కట్టుకొనినదే!

అతని నోరినుండి గబ గబ ఈ మాటలు దొరలెను—"ఇట్టి చీరలు మీ యింట నెన్ని కలవు?"

జయ భయపడెను. అత్తగారు చావనయిన చచ్చునుగాని దొంగతనము చేయదని జయకును దెలియును. అంత నామె భయము తొలఁగెను. పిదప ఇటులనెను—"అమ్మగారు పదిరోజుల్ల కింద మా యత్తగారి కీ కోక ఇచ్చిరి. అదే అక్షయముగా నున్నది."

"మీ రిరువురును గలిసి రాక నీవు వెనుక వచ్చితివేమి ?"

జయకు నవ్వును దుఃఖమును వచ్చెను. "అయ్యో ! నే నిపుడు తమ సన్నిధానములో మనవి చేసికొనిన దదే. అందులకనియే మే మిరువుర మును మిల్లు పనిలోనికి రాజాలకున్నాము. ఆమె యొకరోజునను, నే నొక రోజునను వచ్చుచుందుము ! అందువల్ల...."

జయ మాటలు విని నాగరాజు బిచ్చవడి పోయెను.

★★